## క్లుప్తంగా

### హోటళ్లలో తనిఖీ

వరంగల్ అర్బన్ : వరంగల్ అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని శంభునిపేట జంక్షన్‌లో పలు హోటళ్లలో మంగళవారం ప్రజారోగ్యం అధికారులు, సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. తినుబండారాల శుచి, శుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. శుభ్రత పాటించని పలు హోటళ్లు, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులపై రూ. 5వేలు జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. తనిఖీల్లో సీఎంహెచ్‌ఓ రాజేష్, సానిటరీ సూపర్‌వైజర్ మాదాసి సాంబయ్య, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు పాల్గొన్నారు.

### పవిత్ర మాసం రంజాన్

హన్మకొండ: ముస్లింలకు పవిత్రమాసం రంజాన్ అని జిల్లా సబ్ ట్రెజరీ అధికారి గుజ్జ రాజు అన్నారు. మంగళవారం హనుమకొండ రాంనగర్‌లో తెలంగాణ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్ యూనిట్ అధ్యక్షుడు మహమ్మద్ ఆదిల్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. మహమ్మద్ రఫీ, అజహర్ మహమ్మద్, ముజాహిద్, వహీద్ గుల్షన్ పాల్గొన్నారు.

### 'అధికారుల తప్పిదం వల్లే పేపర్ లీక్'

ఖిలావరంగల్: పిల్లలు భవిష్యత్‌ను తీర్చిదిద్దే ఉపాధ్యాయులే పేపర్ లీక్ చేయడం సిగ్గుచేటుగా ఉందని సామాజిక న్యాయవేదిక వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి, సామాజిక వేత్త అచ్చ వినోద్‌కుమార్, కార్యకర్త ఎండీ.ఫసీ మంగళవారం ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో ఎన్నో కఠినమైన నిర్ణయాలు తీసుకున్న కొంత మంది ఉద్యోగస్తులు అవినీతికి పాల్పడటంతో నిరుద్యోగ యువత నష్టపోతున్నారని తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి అవినీతికి పాల్పడితే వారి ఉద్యోగాన్ని తొలిగించాలని కోరారు.

### వైద్యపరీక్షలు

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ విష్ణుపురి కాలనీలో ఉన్న రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరంను సంఘం అధ్యక్షుడు పి.కృష్ణమూర్తి ప్రారంభించారు. డాక్టర్ మోహన్స్ ఆస్పత్రి వైద్యుల పర్యవేక్షణలో 80 మంది సభ్యులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి గుర్రపు సుధాకర్ రావు, చంద్రమోహన్, సత్యనారయణ, వి.నాగేష్, ఎంకె మూర్తి, బాబురాజ్, సత్య ప్రకాస్ పాల్గొన్నారు.

### ఘనంగా మహావీర్ జయంతి



హన్మకొండ చౌరస్తా: మహావీర్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం హనుమకొండలోని అగ్గలయ్యగుట్ట పైన జైన మతస్తులతో కలిసి ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 24వ జైన తీర్థంకరుడు వర్ధమాన మహావీరుడు గొప్పతనాన్ని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు పులి రజనీకాంత్, చారిత్రక పరిశోధకుడు అరవింద్, జైన మతస్తులు పాల్గొన్నారు.

### నేడు జగ్జీవన్‌రామ్ జయంతి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో బుధవారం ఉదయం 11 గంటలకు కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంటు కళాశాల సెమినార్ హాల్‌లో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించనున్నట్లు కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ ఆచార్య ఏటూరు జ్యోతి , కేయూ అంబేడ్కర్ స్టడీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ మంగళవారం తెలిపారు. వీసీ రమేష్ అధ్యక్షత వహిస్తారు.

వరంగల్ రూరల్: దేశ మాజీ ఉప ప్రధాని, దళిత వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతిని జెడ్పీ హాల్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా దళిత అభివృద్ధి శాఖ అధికారి పెద్దిరెడ్డి భాగ్యలక్ష్మి మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ ప్రకాష్ పాల్గొంటారని తెలిపారు.

### పరామర్శ

హన్మకొండ: వరంగల్ డీసీసీబీ డైరెక్టర్ మాడుగుల రమేష్‌ను ఆ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్‌రావు పరామర్శించారు. ములుగు నర్సాపురం సొసైటీ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ మాడుగుల రమేష్ తండ్రి ఓదెలు అనారోగ్యంతో మృతి చెందగా మంగళవారం వారి స్వగ్రామానికి చేరుకుని ఓదేలు భౌతికకాయం పై పూల మాలవేసి నివాళులర్పించా రు. డైరెక్టర్లు గోపాలరావు, రమేష్, శ్రీనివాస్, ఉన్నారు.

### విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 5న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. సాయినగర్, కంచరకుంట, ఏషియన్ మాల్, ములుగు రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు, బాలసముద్రం మార్కెట్, అంబేడ్కర్ విగ్రహం ప్రాంతంలో ఉదయం 7 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

# బాలల హక్కుల రక్షణకు కృషి చేయాలి

- రైల్వే ప్రొటెక్షన్‌ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్



పోలీస్‌స్టేషన్ ఎదుట అవగాహన కల్పిస్తున్న అధికారులు

కాజీపేట రూరల్ : బాలల హక్కుల పరిరక్షణకు కలిసికట్టుగా కృషి చేయాలని కాజీపేట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ జి.శ్రీనివాస్ అన్నారు. స్థానిక రైల్వే వీఐపీ లాంజ్‌లో మంగళవారం చైల్డ్‌లైన్ కో ఆర్డినేటర్ రాగి కృష్ణమూర్తి అధ్యక్షతన బాలల సంక్షేమ సమితి, పరిరక్షణ సమితి విభాగం, చైల్డ్‌లైన్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, రైల్వే జీఆర్పీ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో అన్ని విభాగాలు సమన్వయంతో బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని అన్నారు. త్వరలో కాజీపేట జంక్షన్‌లో చైల్డ్ రెస్క్యూరూంను ఏర్పాటు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అన్నమనేని అనిల్ చందర్‌రావు మాట్లాడుతూ ఆపదలో ఉన్న బాలబాలికలను గుర్తించి చేరదీసి సంబంధిత అధికారుల ఆధ్వర్యంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు ప్రవేశపెడితే వారికి పునరావాసం కల్పించనున్నట్లు తెలిపారు. కాజీపేట ఆర్పీఎఫ్ సీఐ సంజీవరావు, జీఆర్పీ సీఐ రాంమూర్తి మాట్లాడుతూ బాలబాలికల రక్షణే ధ్యేయంగా రైల్వే పోలీస్ డిపార్ట్‌మెంట్లు పని చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కమిటీ మెంబర్స్ డాక్టర్ పరికి సుధాకర్, సందసాని రాజేంద్రప్రసాద్, కజాంపురం దామోదర్, రైల్వే స్టేషన్ మేనేజర్ బాలరాజు, సీపీఎస్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎస్.ప్రవీన్‌కుమార్, మేరుగు శ్రీనివాసులు, ఎం.శృతి, బి.రవికృష్ణ, బి.జగన్, ఒద్దిరాజు చంద్రప్రకాష్, కొమ్మ జయధర్, రైల్వే పోలీసులు పాల్గొన్నారు.

# రక్తదానం సామాజిక బాధ్యత



మాట్లాడుతున్న ఈవీ శ్రీనివాస్

హసన్‌పర్తి: రక్తదానం సామాజిక బాధ్యతగా గుర్తించాలని ఐఆర్‌సీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈవీ శ్రీనివాస్ అన్నారు. కిట్స్ స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్, ఐఆర్‌సీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ రక్తదానం ప్రాణ దానంతో సమానమన్నారు. కిట్స్ విద్యార్థులు 508 యూనిట్ల రక్తాన్ని అందించినట్లు చెప్పారు. కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకోసారి రక్తదానం చేయాలని సూచించారు. విద్యార్థులు ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాతలకు పండ్లు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జి ల్లా వైస్ గవర్నర్ కె. వెంకట్‌రెడ్డి, ప్రొఫెసర్ నా రాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సీ.సతీష్‌చంద్ర, డాక్టర్ ప్రభాకరాచారి, స్టూడెంట్ క్లబ్ ప్రతినిధులు సాయిచంద్, జగన్మోహన్‌రెడ్డి, సంజయ్, జునైద్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల మాలధారణ

హన్మకొండ: హనుమకొండ పద్మాక్షిరోడ్డులోని హనుమద్గిరి శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో భక్తులు హనుమాన్ మాలధారణ చేశారు. మంగళవారం దేవాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో హనుమత్ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ దుర్గాప్రసాద్ స్వామీజీ మంత్రోచ్చరణల మధ్య 300 మంది భక్తులకు మలధారణ చేయించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో అన్నదాన కమిటీ అధ్యక్షుడు గందె కృష్ణ, ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్, దశరద్ కుమార్, మాదాసు మొగిలయ్య, గంద్ర సుధాకర్, కోలా రాజేందర్, శంకర్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే 'అరూరి' జన్మదిన వేడుకలు



కేయూ క్యాంపస్: కేయూలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్వీ నాయకులు

కేయూ క్యాంపస్: బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ జన్మదిన వేడుకలు కాకతీయ యూనివర్సిటీలో మంగళవారం బీఆర్ఎస్వీ కేయూ ఇన్‌చార్జ్ జట్టి రాజేందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి రమేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, నాయకులు డాక్టర్ పాలకుల కొమురయ్య, ఎం.శరత్‌చంద్ర, చిరంజీవి, తుపాకి రవి, లంక రాజ గోపాల్, వీరు, పి.నాగరాజు, ఎస్.విష్ణు, కె.తిరుపతి, కె.ప్రశాంత్, అభిషేక్, డి రాంబాబు, రవి, రమేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మడికొండ: అరూరి రమష్ జన్మదినం సందర్భంగా మడికొండ 46వ డివిజన్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ మునిగాల సరోజన, అధ్యక్షుడు బొల్లికొండ వినోద్, పైడిపాల రవీందర్, గాండ్ల భిక్షపతి, కృష్ణమూర్తి, కుమార్‌బాబు, కుమార్‌రాజ, అబ్బసాయిలు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

వరంగల్: అరూరి రమేష్ పుట్టినరోజును పురస్కరించుకొని మంగళవారం 14వ డివిజన్ ఎస్ఆర్‌నగర్‌లో బర్త్‌డే కేక్ కట్ చేసి పండ్లను పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షులు ముడుసు నరసింహ, నాయకులు గంద్రాతి భాస్కర్, మాధవి, విజయ, జంగం రాజు, పత్రి సుభాష్, పత్రి రాజాపోషాలు, పసులాది మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'నాట్య సిరి' అవార్డు గెలుచుకున్న మనస్విని



కాశిబుగ్గ : కాశిబుగ్గ వివేకానందకాలనీ బాలజ్యోతి హైస్కూల్లో 5వ తరగతి చదువుతున్న బొడ్డుల మనస్విని కూచిపూడి నృత్యంలో అత్యంత ప్రతిభ కనబర్చి 'నాట్య సిరి' అవార్డు గెలుచుకుంది. సోమవారం విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రీయ కళా క్షేత్రంలో జరిగిన ఉభయ రాష్ట్రాల కూచిపూడి, భరతనాట్యం, జానపదం నాట్యోత్సవంలో మనస్విని నాట్యం ప్రదర్శించి అవార్డు సాధించిందని స్కూల్ కరస్పాండెంట్ పొన్నోజు చక్రపాణి తెలిపారు. ఈ సందర్భంగా మనస్విని పలువురు అభినందించారు.

# రాజకీయ ప్రయోజనాలకే పర్యటనలు

కేయూ క్యాంపస్ : రాజకీయ దురుద్దేశంతోనే బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నిరుద్యోగులతో యూనివర్సిటీల్లో రాజకీయాలు చేస్తున్నాడని బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్‌చంద్ర, బాధ్యులు పాలమకుల కొమురయ్య, జట్టి రాజేందర్ విమర్శించారు. మంగళవారం కేయూ మొదటిగేట్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తన రాజకీయ స్వార్థం కోసమే ప్రవీణ్ కుమార్ యువతను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. రద్దు కాబడిన పరీక్షలు రాసిన అభ్యర్థులు సంఖ్య 4 లక్షలు పైగా ఉంటే ప్రవీణ్ కుమార్ 30 లక్షల మందికి అన్యాయం జరిగిందంటూ తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. బీజేపీ ఏజెంట్‌గా మారిన ప్రవీణ్ కుమార్ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించడమే చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాడన్నారు. గురుకులాల సెక్రటరీగా పని చేసిన కాలంలో తెలంగాణ విద్య దేశానికే ఆదర్శమని ప్రవీణ్‌కుమార్ అన్నారని వారు గుర్తుచేశారు.కార్యక్రమంలోనాయకులు లంక రాజగోపాల్, పిల్లల నాగరాజు, గొల్లపల్లి వీరు, కంది కొండ తిరుపతి, శంగారపు విష్ణు, కొనుకటి ప్రశాంత్, డెక్క రాంబాబు, ఐలోని అభిషేక్, మోటే చిరంజీవి, తుపాకుల రవి, రమేష్ పాల్గొన్నారు.

# చలో ఢిల్లీకి తరలిన నాయకులు



ఢిల్లీకి తరలివెళ్తున్న నాయకులు

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ నుంచి మంగళవారం సీఐటీయూ జిల్లా రైతు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు న్యూఢిల్లీకి తరలివెళ్లారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.రాములు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.చుక్కయ్య మాట్లాడుతూ గడిచిన తొమ్మిదేళ్లలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ కార్మిక కర్షక చట్టాలను రద్దు చేసి యాజమాన్యాలకు పెట్టుబడుదారులకు అనుకూలంగా కొత్త చట్టాలను తీసుకవచ్చిందని ఆరోపించారు. ఏప్రిల్ 5న పార్లమెంట్ ఎదుట మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ 5 లక్షల మందితో చేపట్టే ర్యాలీలో తరలివెళ్లి పాల్గొంటున్నట్లు తెలిపారు. హన్మకొండ జిల్లా నుంచి 500 మంది కార్మికులు తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీకి తరలివెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సారంపల్లి వాసుదేవరెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గాదె ప్రభాకర్‌రెడ్డి, వేల్పుల సారంగపాణి, బండి పర్వతాలు, కె.లింగయ్య, పుల్ల అశోక్, బొల్లారపు సంపత్, రాంచందర్, సంగాల మొగిళి, కల్పన, పద్మ, సునీత, సారయ్య పాల్గొన్నారు.

# కార్యశాలలతో నూతన ఉత్సాహం



సభలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు

కేయూ క్యాంపస్: అధ్యాపకుడు నిరంతర విద్యార్థి అని మారుతున్న టెక్నాలజీ యుగంలో నూతన అంశాలు టెక్నిక్ టూల్స్‌పై అవగాహన అవసరమని ఇలాంటి కార్యశాలలతో అధ్యాపకుల్లో నూతన ఉత్సాహం వస్తుందని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు అన్నారు. కేయూలోని ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో మ్యాట్‌ల్యాబ్స్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్ అంశంపై నిర్వహిస్తున్న వర్క్‌షాప్ ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యశాలలో నేర్చుకున్న అంశాలను విద్యాబోధనలో విద్యార్థులకు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి.సురేష్‌లాల్, కార్యశాల కన్వీనర్ జి.ప్మజ, ఆ విభాగం అధిపతి డాక్టర్ సీజె. శ్రీలత, ఆచార్యులు బీ.వెంకట్రామ్‌రెడ్డి, డాక్టర్ ఎ.నరేందర్, విశ్రాంత ఆచార్యులు గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యశాలలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

# ఇంటింటికీ బీజేపీని తీసుకెళ్లాలి

ఖిలా వరంగల్: పార్టీ బలోపేతానికి ఇంటింటికి బీజేపీని తీసుకెళ్లాలని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందిమళ్ల మహేష్ పిలుపునిచ్చారు. మంగళవారం వరంగల్ 38వ డివిజన్ పడమరకోట జంక్షన్ అమర వీరుల స్థూపం వద్ద బీజేపీ 38వ డివిజన్ అధ్యక్షుడు ఎల్లబోయిన చంద్రమోహన్ ఆధ్వర్యంలో పల్లెపల్లెకు మోర్చా ఓబీసీ, ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మహేష్ హాజరై ఇంటింటా బీజేపీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో వేల్పుల నందు, ఉప్పాల రాజేందర్, అంకాల జనార్ధన్, ఇనుముల రాజు, కంద్రతి శ్రీను, ప్రవీణ్, మహేష్, పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీరామచంద్రస్వామి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

ఖిలా వరంగల్: రంగశాయిపేటలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం చుట్టూ స్వామి రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం శ్రీవద్దిరాజు రంగారావు, శ్యాం సుందర్‌రావు, లక్ష్మీకాంత్ రావు ఆధ్వర్యంలో పులిగిళ్ల వెంకటరామనర్సింహ శాస్త్రి, ఎన్. వెంకట్రావ్, అర్చకులు తిరుమల శ్రీధరాచార్యులు నేతృత్వంలో శ్రీసీతారామచంద్రస్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు జరిపారు. రథంపై ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూలతో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో వలపదాసు కృష్ణ, శేర్ల ప్రభాకర్, సోమ అనిల్, మచ్చ కవిత, వద్దిరాజు లక్ష్మీ, మనోహర్‌రావు, శ్రీనివాస్‌రావు, ప్రశాంత్, యరబాటి రాజేశ్వర్‌రావు, రవికాంత్, శ్రీరామభజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి



మాట్లాడుతున్న కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్

నయీంనగర్ : తెలంగాణ ప్రభుత్వం ప్రజాకవి కాళోజీ నారాయణరావు పేరిట నిర్మిస్తున్న కళాక్షేత్రం , భద్రకాళి మాఢ వీధుల నిర్మాణం పనుల్లో వేగం పెంచాలని కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. సోమవారం కుడా కార్యాలయ మీటింగ్ హాల్‌లో ప్రణాళిక, ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాక్షేత్రం నిర్మాణం సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేయాలని, పనుల పురోగతిపై ప్రతి 15 రోజులకోసారి సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఆలయ ప్రాకారం, రాజగోపురం, మాఢ వీధుల నిర్మాణాలకు సంబంధించిన అన్ని పనుల ప్రణాళికలను పూర్తి చేసి నిర్మాణ పనులు త్వరితగతిన మొదలయ్యేలా చూడాలని సూచించారు. సమావేశంలో సీపీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీం రావు, డీఈ రఘునందన్‌రావు, ఏఈలు సిద్ధార్థనాయక్, భరత్, జలాల్, కాంట్రాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారులకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న డీఈ శ్యామల్‌నాయక్

హసన్‌పర్తి: వినియోగారులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని హన్మకొండ రూరల్ డివిజన్ ఇంజనీర్ శ్యామల్‌నాయక్ ఆదేశించారు. హసన్‌పర్తి సబ్ డివిజన్ సమీక్షా సమావేశం ఎర్రగట్టుగుట్ట సమీపంలోని మిత్ర కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం జరిగింది. సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ అనధికార సర్వీస్‌లను క్రమబద్ధీకరించాలని, అందుకు ఆయా ప్రాంతాల్లో అక్రమ కనెక్షన్లను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ బావుల బకాయిలను యుద్ధప్రాతిపదికన ఈనెల 10 లోపు వసూలు చేయాలని ఆదేశించారు. ఎస్సీ కాలనీల్లో విద్యుత్ మీటర్లు బిగించుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో సబ్ డివిజన్ ఇంజనీర్ గంగారెడ్డి, చింతగట్టు సెక్షన్ ఏఈ ప్రదీప్‌కుమార్, హసన్‌పర్తి సెక్షన్ ఏఈ మంగమ్మ, లైన్ ఇన్‌స్పెక్టర్ రౌతు రమేష్‌కుమార్, రాజేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

# కాజీపేటలో రైల్వే జంక్షన్‌లో చెకింగ్ స్టాఫ్ తనిఖీలు



కాజీపేట జంక్షన్‌కు చేరుకున్న టికెట్ చెకింగ్ బృందం

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో మంగళవారం రైల్వే టిక్కెట్ చెకింగ్ స్టాఫ్ తనిఖీలు చేపట్టారు. సికింద్రాబాద్‌కు చెందిన టిక్కెట్ చెకింగ్ స్క్వాడ్ టీటీఈలు, టీసీలు, సీటీఐల బృందం సికింద్రాబాద్ నుంచి బయలుదేరే వివిధ రైళ్లలో తనిఖీలు చేసుకుంటూ కాజీపేటకు చేరుకున్నారు. కాజీపేట జంక్షన్‌లో కూడా తనిఖీలు చేపట్టారు. టిక్కెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని జరిమానా విధించారు. టిక్కెట్ తీసుకొని ప్రయాణం చేయాలని ప్రయాణికులకు అవగాహన కల్పించారు.

## సంక్షిప్త సమాచారం

### న్యాయమూర్తులను కలిసిన బార్ అసోసియేషన్ బాధ్యులు



వరంగల్ లీగల్ : నూతనంగా ఎన్నికైన హనుమకొండ, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ బాధ్యులు సోమవారం హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తులు ఎం.కృష్ణమూర్తి, కె.రాధాదేవిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. కలిసిన వారిలో అధ్యక్షుడు వై.శ్యామ్‌సుందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.శ్రీధర్, ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ సీహెచ్. శ్రీనివాస్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ విజేందర్, మహిళా సెక్రటరీ ఇందిరా విశాలి, ఆనందరావు, పూస శ్రీనివాస్, కవిత, అమృతరావు, శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

### సమష్టిగా ఉంటేనే అభివృద్ధి సాధ్యం

వరంగల్: నాయీబ్రాహ్మణులంతా సమష్టిగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని ఓరుగల్లు నాయీబ్రాహ్మణ సహాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు కస్తూరి సతీష్ అన్నారు. మంగళవారం పోచమ్మమైదాన్‌లో జరిగిన సంఘం ద్వితీయ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

### సంతానలేమి శాపం కాదు

హన్మకొండ చౌరస్తా : సంతానం కలుగకపోవడం శాపమేమీ కాదని అధునాతన శాస్త్రీయ పద్ధతిలో సంతాన సాఫల్యం పొందడం సులువని డాక్టర్ శ్రేయ గౌనీ అన్నారు. హనుమకొండ చౌరస్తాలోని మాత్రికా ఫెర్టిలిటీ సెంటర్ 5వ వార్షికోత్సవ వేడుకలు ఫెర్టిలిటీ ద్వారా సంతానం పొందిన తల్లిదండ్రులు, చిన్నారుల మధ్య ఘనంగా జరిగాయి.

### బృందావనం కాలనీ నూతన కమిటీ

కాజీపేట: 63వ డివిజన్‌లో మంగళవారం బృందావన్ కాలనీ అభివృద్ధిని కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా దాస్యం వినయ్‌భాస్కర్, అధ్యక్షురాలిగా బర్ల సరోజ, ఉపాధ్యక్షులుగా మేకల రవీందర్, కరుణ, భారతి, ప్రధాన కార్యదర్శిగా మద్దెల భద్రయ్య, కార్యదర్శులుగా మూల విజయ, ఎస్‌డీ.షాకీర్, కలీమ్, కోశాధికారిగా క్రూజ్ సిల్వేష్టర్‌తో పాటు పలువురు సభ్యులుగా నియమితులయ్యారు.

### రక్షణ కల్పించండి

నయీంనగర్ : బీఆర్ఎస్ 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అండదండలతో అతని అనుచరులు తమ ఇంటిని తక్కువ ధరకు ఇవ్వాలని లేకుంటే ఇల్లు అమ్మడానికి వీలులేదని బెదిరిస్తున్నారని కరీమాబాద్ డీకేనగర్ వాసులు చిలువేరు శంకర్, చిలువేరు చందర్‌లు ఆరోపించారు. సోమవారం హన్మకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తమకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని, పోలీస్‌లను వేడుకున్నారు.

### పరిశోధనలపై ఆసక్తిని పెంపొందించుకోవాలి

కాజీపేట అర్బన్ : విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్ తెలిపారు. హంటర్‌రోడ్డులోని గురకుల బాలికల డిగ్రీ కళాశాలలో రీజినల్ సైన్స్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం నేషనల్ సైన్స్ డే వేడుకలను నిర్వహించారు. విద్యార్థినులకు సైన్స్ అండ్ టెక్నాలజీపై పలు పోటీలు నిర్వహించారు.

### పోషకాలపై అవగాహన పెంచుకోవాలి

ఖిలా వరంగల్: చిన్నారులకు పలు రకాల వంటకాలు, పండ్ల రకాలు, పోషక ఆహారంపై అవగాహన పెంచేందుకు ఫుడ్‌ఫెస్టివల్ వేడుకలు నిర్వహించామని న్యూకొటిల్యాస్ హైస్కూల్ కరస్పాండెంట్ కోడం శ్రీధర్ అన్నారు. మంగళవారం 39వ డివిజన్ కరీమాబాద్ రోడ్డులోని న్యూకొటిల్యాస్ ఎస్.ఏ.హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలు కోడం సబిత ఆధ్వర్యంలో ఫుడ్ స్టాల్స్ ఎగ్జిబిషన్, ఫుడ్‌పెస్టివల్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

### నేడు అయ్యప్పస్వామి జయంతి

ఖిలా వరంగల్: వరంగల్ కరీమాబాద్, ఉర్సు బొడ్రాయి సమీపంలోని శ్రీ శివాంజనేయ దేవస్థానంలో శ్రీ అయ్యప్ప సేవా సమితి, నాగమయ్య కుటీరం ఉర్సు వారి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 7 గంటలకు పడిపూజ, అభిషేకములు, మధ్యాహ్నం 12.30 గంటలకు మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నాగమయ్య కుటీరం ప్రతినిధి బత్తిని సుభాష్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### వ్యక్తిపై కేసు నమోదు

ఖిలా వరంగల్: క్రికెట్ బెట్టింగ్ వెబ్‌సైట్ చూపించి రూ.5 వేలు కాజేసి ఉడాయించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసుల తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం..హన్మకొండ కుమార్‌పల్లికి చెందిన కొరవి మధుకుమార్ వ్యక్తిగత పనిమీద మంగళవారం వరంగల్ ఓ సిటీకి వచ్చాడు. పార్కులో సాయంత్రం 4 గంటలకు సేద తీరుతూ మొబైల్‌లో ఐపీఎల్ క్రికెట్ చూస్తుండగా చత్తీస్‌ఘడ్‌కు చెందిన పఠాన్ అతన్ని పరిచయం చేసుకున్నాడు. మ్యాచ్‌తో సంపాదించే మార్గం చెబుతానంటూ అతన్ని నమ్మించి అతని ఫోన్లలోని 6232093622 క్రికెట్ బెట్టింగ్‌కి సంబంధించిన వెబ్‌సైట్ చూపించాడు. అందులో లోటస్ 365 అని ఉంది. అతని ఫోన్‌లోని లావాదేవీలు చూపించగా బాధితుడు నమ్మి రూ.5వేలు పంపాడు. ఆబెట్టింగ్ వెబ్ సైట్‌లో పెట్టి తిరిగి పది వేలు ఫోన్‌పే చేశాడు.ఆ తర్వాత ఆతడిని పూర్తిగా నమ్మి రూ.10 వేలు వెబ్‌సైట్‌లో బెట్టింగ్ పెట్టాడు. పఠానుబాబా ఇప్పుడే వస్తానని నమ్మించి ఉడాయించాడు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### ప్రశాంత్ అరెస్ట్‌పై ఆలోచించాలి

వరంగల్ క్రైం: పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం లీలీకేజీ అంశాన్ని వాట్సప్ గ్రూప్‌ల్లో వైరల్ చేసినందుకు గతంలో మీడియాలో పనిచేసిన బూరం ప్రశాంత్ అరెస్ట్‌పై మరోసారి ఆలోచించాలని జర్నలిస్టులు మంగళవారం రాత్రి వరంగల్ పోలీస్ కమిషనర్ ఏ.వీ రంగనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రశాంత్ హిందీ పేపర్‌ను జర్నలిస్టు వాట్సప్ గ్రూప్‌లకు గతంలో మాదిరిగా పంపించాడన్నారు. అందులో ఎలాంటి దురుద్దేశం లేదని సీపీకి వివరించారు. ప్రశ్నపత్రం లికేజీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి ప్రశాంత్‌కు న్యాయం చేయాలని కోరారు. సీపీని కలిసిన వారిలో జర్నలిస్టు నేతలు మస్కపూరి సుధాకర్, బొల్లారం సదయ్య, పెద్దీష్, కెంచె కుమారస్వామి, కృష్ణమోహన్, కిరణ్, అరుణ్, సతీష్ తదితరులు ఉన్నారు.

# స్థలం అమ్మకుండా చర్యలు తీసుకోవాలి

ఖిలావరంగల్: ప్రభుత్వ చెరువు శిఖం భూముల్లో వేసిన గుడిసె స్థలాన్ని విక్రయించకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక కార్పొరేటర్ మరుపెల్లి రవి కోరారు. మంగళవారం తహసీల్దార్ ఫణికుమార్‌ను గుడిసెవాసులతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17 ఏళ్ల క్రితం డీకే నగర్ పేరుతో పేదలు సామూహికంగా గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న గుడిసెవాసులు తమ గుడిసెస్థలాన్ని ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. గుడిసెవాసులు ఎవరైనా అమ్మినా, కొనుగుగోలు చేసిన చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వినతిప్రతంలో పేర్కొన్నారు. వెంటనే ఆయన పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కుండె రాజు, నరసింహా, దాసరి రాజు, అమీర్, రావుల రవి, పిట్టల రాజు, పొలం రంజిత్, మంద రమ, విజయ, చీరలక్ష్మీ, మహేశ్వరి, వెన్నం పద్మ తదితరులు పాల్గొన్నారు